## క్లుప్తంగా

### ఏలూరు వైస్ ఎంపీపీగా నాగరాజు



నాగరాజుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి

దెందులూరు: ఏలూరు వైస్ ఎంపీపీగా ఇండిపెండెంట్ అభ్యర్థి గండికోట నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఆరుగురు ఎన్నికకు హాజరయ్యారు. నాగరాజును వైస్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను ఎన్నికల అధికారి డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి ప్రకటించారు. ఎంపీడీఓ శ్రీలత, ఉద్యోగులు ఉన్నారు.

### విద్యార్థినులకు ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్లోబల్ వన్ సర్వీసెస్ సంస్థ (హైదరాబాద్) సహకారంతో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. గ్లోబల్ వన్ సర్వీసెస్ సీఈఓ సునీల్ కుమార్, ఇన్ఫోలుమి సంస్థ హెచ్ఆర్ కిష్షర్ కుమార్ పాల్గొన్నారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 161 మంది పాల్గొనగా, వీరిలో 80 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ జి.సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.ఝాన్సీలక్ష్మి, కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధి జీఎస్ఆర్ కల్యాణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

### 5న దళిత సేన సింహగర్జన

దెందులూరు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ ఏప్రిల్ 5న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే దళిత సేన సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రవిప్రకాష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం చల్లపల్లిలో ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు.

### బహుమతుల అందజేత

కామవరపుకోట: మండలంలో తడికలపూడి గ్రామం లూర్దుమాత కొండపై ఉన్న గ్రౌండ్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి చాంపియన్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం తహసీల్దార్ గద్దం ఎలిసా, తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఏలూరు సూపర్ కింగ్స్‌కి ట్రోఫీతో పాటు రూ.33,333, రెండో బహుమతి మేదంద్రుపాలెం వారికి ట్రోఫీతో పాటు రూ.22,222, మూడో బహుమతి పూళ్ల సోల్జర్స్‌కి ట్రోఫీతో పాటు రూ.15,555 అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ దోమతోటి నతానియేల్, బొంతు వెంకటేశ్వరరావు, మెరుగు సుందర్రావు, మోటేపల్లి రామకృష్ణ, కరటూరి గంగాద్రిప్రసాద్, మెరుగు హరిబాబు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాల సాధనే లక్ష్యం



పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించి, వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త జేపీ, వైఎస్సార్ సీపీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ముఖ్య నేతలు



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

- ఘనంగా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం
- కేక్ కట్‌చేసి, కార్మికులకు దుస్తుల పంపిణీ
- జెండా ఆవిష్కరించిన పార్టీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రతి పేద, మధ్య తరగతి వర్గాలకు వైఎస్సార్ సీపీ పాలనతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలపెన్నిదిగా పేరు తెచ్చుకున్నారని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను జేపీ ఆవిష్కరించారు. దివంగత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యనేతలు, కార్మికులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు నగరంలోని పేద కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.

**అన్ని వర్గాలకూ మేలు**

ఈ సందర్భంగా ఏలూరు సమన్వయకర్త జేపీ మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్సార్ ఆశయ సాధనే లక్ష్యంగా యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ (వైఎస్సార్ సీపీ)ను మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి రైతు, కార్మికుడు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాలకు మేలు చేయాలనే సంకల్పంతో పార్టీని స్థాపించగా, కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేశారని వివరించారు. గత ఐదేళ్ల కాలంలో నవరత్నాల పేరుతో లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజల హృదయాల్లో అభిమానాన్ని నింపుకున్నారని తెలిపారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి తమవంతు పోరాటం చేస్తామని చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో సరైన ఉపాధి పనులు లేక పేదలు అల్లాడిపోతురని, ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు జీఎంఆర్, మున్నుల జాన్‌గురునాథ్, నెరుసు చిరంజీవి, నూకపెయ్యి సుధీర్‌బాబు, షేక్ బాజీ, భాస్కర్ల బాచి, కిలాడి దుర్గారావు, కేవీఎస్ రామకృష్ణ, షేక్ సమీర్, తేరా ఆనంద్, స్టాలిన్, జనార్థన్, తులసీ, బుద్దాల రాము, బత్తిన మస్తాన్‌రావు, గంటా సాయి ప్రదీప్, ఇనపనూరి జగదీష్, మద్దాల ఫణి, దేవరకొండ నాగేశ్వరరావు, గ్లేవియర్ మాస్టార్, అట్బాడ రామకృష్ణ, ఉయ్యాల గణేష్, పిట్టా ధనుంజయ్, బుజ్జమ్మ, సృజన్, బత్తిన నాగేశ్వరరావు, కొవ్వాడ దుర్గారావు, ఏసుపాదం, పల్లి సిటీ వింగ్ కొల్లిపర భగవాన్, ఎచ్చెర్ల ఉమామహేశ్వరరావు, లూటుకుర్తి సుభాష్, బసవ, తులసీ వర్మ, బాలత్రిపుర సుందరి, శ్రీనివాసరావు, నేతల కోటి, సైదు కొండ, జంగం నారాయణ, ఎక్కల నాని, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

## ఖురాన్, ఖర్జూరం పంపిణీ



ముస్లింలకు ఖురాన్, ఖర్జూరం ప్యాకెట్లు అందిస్తున్న జేపీ, బాజీ

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ఏలూరు కార్యాలయంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ సయ్యద్ బాజీ (గాజుల బాజీ) ఆధ్వర్యంలో రంజాన్ దీక్షలను పురస్కరించుకుని ముస్లింలకు ఖురాన్, ఖర్జూరం ప్యాకెట్లు పంపిణీ చేశారు. వీటిని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ చేతులమీదుగా పంపిణీ చేయించారు. తొలుత రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాబోయే రంజాన్ పర్వదినాన్ని ముస్లింలంతా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, అల్లాహ్ దయతో అందరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవి, నూకపెయ్యి సుధీర్‌బాబు, దుర్గారావు, గంటా మోహనరావు, తదితరులు హాజరయ్యారు.

# వైభవంగా నూకాలమ్మ జాతర



ఊరేగింపులో శక్తి వేషధారులు



నూకాలమ్మవారు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 43వ డివిజన్‌లో నూకాలమ్మ కొత్త అమావాస్య జాతర మహోత్సవం దేవాదాయ శాఖ, ఉత్సవ కమిటీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభోగంగా నిర్వహించారు. తొలుత ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆలయంలో పూజలు చేసి, జాతరను ప్రారంభించారు. నూకాలమ్మ కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అర్చకుడు మంత్రవాది రామకృష్ణ యోగానంద శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బేత, భూతాల వేషధారణలు, కోలాట నృత్యం, గోవిందా గోవిందా నృత్య ప్రదర్శన, కాళికాదేవి, లక్ష్మీనరసింహ, శక్తి వేషధారణలతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో త్రిపర్ణ రాజేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ దావాలా రంగ సత్యనారాయణ, జంపా సూర్యనారాయణ, ఆలయ వ్యవస్థాపకులు కొఠారి అప్పల కొండల రావు, నీరుకొండ అప్పారావు, వలపుల నూకరాజు, ఉల్లింగల సురేష్, కరణం రాజు, కోలా సురేష్, నక్క నాగేశ్వరావు, గొంతిన రామకృష్ణ, సగిరెడ్డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### మతసామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సర్వ మానవాళి సుఖ సంతోషాలు రంజాన్ ప్రార్థనల ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో మైనారిటీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. మతసామరస్యానికి ప్రతీక అయిన రంజాన్ మాసంలో చేసే ఉపవాస దీక్ష ద్వారా మానసిక, శారీరక పవిత్రత చేకూరుతుందని అన్నారు. ఓర్పు, సహనంతో ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నది రంజాన్ ఉపవాస దీక్షల ప్రధాన సందేశమని వివరించారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్ష చేసిన చిన్నారులతో, ముస్లిం మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందులో కలెక్టర్ పాల్గొన్నారు. తొలుత ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ కె.విజయరాజు, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమాధికారి నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ పి.నాగార్జునరావు, వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా, సెట్ వెల్ మేనేజర్ ప్రభాకర్, మతపెద్దలు పాల్గొన్నారు.

### 2, 3 తేదీల్లో ఇంటర్వ్యూలు

పెదపాడు : బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఈనెల 2, 3 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎండీ అమీలు జమా తెలిపారు. ఇటీవల ఆన్‌లైన్ ద్వారా మండలంలోని 23 గ్రామాలకు చెందిన 839 మంది స్వయం ఉపాధి సోపానంలో రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. దరఖాస్తుదారులు తమకు కేటాయించిన తేదీల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు.

# ఆటో డ్రైవర్ల ఉపాధి కాపాడండి




యాత్ర కరపత్రం విడుదల చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి

ఏలూరు (టూటౌన్): ఆటో డ్రైవర్లకు సంక్షేమ చట్టం చేయాలని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాపిడో, ఉబర్, ఓలా వంటి విదేశీ కార్పొరేట్ సంస్థల వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన ప్రచార యాత్ర సభలో ఆయన మాట్లాడారు. ఎటువంటి పెట్టుబడి లేకుండా ఒక కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని, రూ.కోట్లలో మన దేశ ఆదాయాలను కొల్లగొడుతున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వదేశీ నినాదాన్ని ప్రచారం చేస్తూ, విదేశీ బహుళ జాతి కంపెనీలకు అనుమతులు ఇవ్వడం సరికాదని అన్నారు. ఆరు శాతానికి మించి కమీషన్లు వసూలు చేయకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ 25 నుంచి 30 శాతం కమీషన్ వసూలు చేస్తున్న రేపిడో, ఉబర్, ఓలా సంస్థలపై కర్ణాటక తరహాలో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో అనేక దశాబ్దాలుగా ప్రజలకు సురక్షిత ప్రయాణ సేవలను అందిస్తూ, ఆటో డ్రైవర్లు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అసలే కిరాయిలు లేక అవస్థలు పడుతున్న సమయంలో రాపిడో వంటి సంస్థల వాహనాలు స్థానిక ఆటో కార్మికుల కిరాయిలను తరలించకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యాత్రకు నగర కమిటీ అధ్యక్షుడు అడ్డాల రాజు (నాని), స్థానిక ఆటో యూనియన్ల నాయకులు కె.నారాయణ, శంకర్, రాజు నాయకత్వం వహించగా ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# నిరుద్యోగ భృతి ఊసే లేదు !

- ఎన్నికల ముందు విస్తృత ప్రచారం
- 9 నెలలైనా పథకం అమలుపై రాని విధివిధానాలు
- 18 వేలమంది నిరుద్యోగుల ఎదురుచూపు



దెందులూరు: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు నిరుద్యోగ భృతిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అధికారం చేపట్టిన వెంటనే ఈ పథకం అమలు చేస్తామని, అర్హత ఉన్న ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేలు వస్తామని ఇంటింటికీ వెళ్లి ఓట్లు దండుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతి ఊసే లేదు. బడ్జెట్‌లో కూడా ఈ పథకానికి తగిన నిధులు కేటాయించకపోవడంతో నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అమలు చేయాలని ముక్తకంఠంతో వారు కోరుతున్నారు.

**నెరవేర్చని తొలి సంతకం**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజున మొదటి సంతకం చేసిన డిఎస్సీకే ఇప్పటివరకు దిక్కులేదని నిరుద్యోగులు వాపోతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో రెండు వేలకు పైగా బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. తొలి సంతకాన్ని నమ్మి వివిధ కోచింగ్ సెంటర్లలో చేరి శిక్షణ పొందుతున్నారు. ప్రభుత్వం టెట్‌తోనే సరిపెట్టి ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా వాయిదాలు వేస్తోంది. ఇతర ఉద్యోగాలు భర్తీకి కూడా కూటమి సర్కారు స్పష్టమైన ప్రకటన చేయలేదు. గ్రూపు-2 పరీక్షలు నిర్వహించినా ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారో? ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఎన్నికల హామీ మేరకు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని నియోజకవర్గంలోని 18 వేలకు పైగా ఉన్న నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

### హామీలు నెరవేర్చాలి



ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు ప్రచారం చేశారు. కనీసం ఈ పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఇప్పటికీ ప్రకటించలేదు. ఓట్లు దండుకోవడానికే హామీలు ఇచ్చారు. నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు. 2014లో చేసినట్లే మళ్లీ మోసం చేస్తామనుకుంటే నిరుద్యోగులు ఈ ప్రభుత్వంపై తిరగబడే అవకాశం ఉంది.

– కట్టా ఏసుబాబు, నిరుద్యోగి దెందులూరు

### ఉద్యోగాల భర్తీ చేపట్టాలి



ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగులు ఇస్తామని, ఏడాదికి 4 లక్షల ఉద్యోగులు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించారు. ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా నిరుద్యోగులకు కల్పించలేదు. డీఎస్సీ లేదు. నోటిఫికేషన్ విడుదల చేయడం లేదు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి అన్నారు. అదీ లేదు. నిరుద్యోగులకు తీరని మోసం చేస్తున్నారు.

– బోరా మురళి, నిరుద్యోగి దెందులూరు

# కొల్లేరు బాధితుల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న నాయకులు

దెందులూరు: కొల్లేరు ఆపరేషన్ పేరుతో ప్రభుత్వం చేపట్టిన చర్యలు వల్ల కొల్లేరు పేదలు జీవనోపాధికి ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొల్లేరు ప్రజా సమస్యలపై సీపీఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కొల్లేరు సరస్సును 5 నుంచి 3వ కాంటూరుకు కుదించాలని, కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన పేదలు, సొసైటీలు, డి.ఫారం పట్టాదారులకు కుటుంబానికి రెండెకరాల భూమి ఇవ్వాలని కోరారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. నష్టపోయిన జిరాయితీ చిన్న, సన్నకారు రైతులకు భూమికి విలువైన ప్రత్యామ్నాయ భూమి ఇవ్వాలని, బెడ్ (లోతట్టు) గ్రామాల్లో రోడ్లు, వంతెనలు, చెరువులు, ఇతర ప్రజావసర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. రెగ్యులేటర్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు పరిధి పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ లింగరాజు, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, నాయకులు ఎస్ సత్యనారాయణ, కొల్లేరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### తాగునీటి ఎద్దడిని అరికట్టాలి

టి.నరసాపురం: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పాడైన చేతిపంపులు గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. మండలంలో ఉపాధి కూలీలకు ఉపాధి పనులు కల్పించి, త్వరితగతిన మేట్‌లను నియమించాలని కోరారు. గండిగూడెం, బొర్రంపాలెం, టి.నరసాపురం పాఠశాలల్లో ప్రమాదకరంగా ఉన్న ఇంకుడు గుంతలు వెంటనే పూడ్చించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 3 నుంచి 20 సెంట్ల స్థలం ఉంటే ఉచితంగా ప్రభుత్వం సోలార్ విద్యుత్ అందిస్తుందని తెలిపారు. హౌసింగ్ పథకం ద్వారా ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలతో పాటు అదనంగా ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, కొండల్లో ఉండే గిరిజనులకు రూ.లక్ష మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మి, ఎంపీడీఓ జి.మణి కుమారి, తహసీల్దార్ టి.సాయిబాబా ఆయా శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 18 | అరటి కాయ (1) | 06-08 |
| వంకాయలు (గులాబీ) | 26 | చిక్కుడు కాయలు | 54 |
| వంకాయలు (కాంతులు) | 32 | బీన్లచిక్కుడు | 88 |
| వంకాయలు (తెలుపు) | 30 | చామదుంపలు | 48 |
| బెండకాయలు | 30 | ములక్కాడలు | 10, 15 |
| పచ్చిమిర్చి | 26 | కంద | 76 |
| కాకర కాయలు | 28-36 | బీట్‌రూట్ | 30 |
| బీరకాయలు | 34 | కీరా దోస | 36 |
| బీరకాయలు (పందిరి) | 48 | ఫ్రెంచ్‌బీన్స్ | 70 |
| క్యాబేజీ | 16 | అల్లం | 60 |
| క్యారెట్ | 34 | కొత్తిమీర (కట్ట) | 20 |
| దొండకాయలు | 30 | పాలకూర | 10 |
| బంగాళదుంపలు | 30 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 30 | చుక్కకూర | 10 |
| గోరుచిక్కుడు | 36 | గోంగూర | 07-10 |
| దోసకాయలు | 24-30 | పుదీనా | 05 |
| ఆనబకాయ (1) | 20 | క్యాప్సికమ్ | 50 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 27 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 38 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 23 |
| ఏలూరు - తిరుపతి (ఇంద్ర) | 19.00 | 30 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 30 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 31 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 30 |
| ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 34 |
| ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 31 |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | రద్దు |
| ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 35 |
| ఏలూరు -ఈసీఐఎల్ | 22.30 | 4814 | 31 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 28 |